నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు


నూతన ఫీడర్‌ను ప్రారంభిస్తున్న సీజీఎం పాండ్యానాయక్

శంషాబాద్ రూరల్: వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు సీజీఎం పాండ్యానాయక్ అన్నారు. మండలంలోని పెద్దషాపూర్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన నూతన ఫీడర్‌ను ఆయన శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ సర్కిల్ ఎస్ఈ రామ్మోహన్, డీఈ రత్నాకర్‌రావు, డీఈ(కన్‌స్ట్రక్షన్) చంద్రశేఖర్, డీఈ (ప్రొటెక్షన్) భాస్కర్‌రావు, ఏడీఈ రమేష్, ఏఈలు షేక్ బాషా, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీపీయూఎస్ కేలండర్ ఆవిష్కరణ



శంషాబాద్ రూరల్: టీపీయూఎస్ ఉపాధ్యాయ సంఘం మండల శాఖ డైరీ, నూతన సంవత్సర కేలండర్‌ను శనివారం ఎంఆర్సీ భవనంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి లక్ష్మణ్‌నాయక్, టీపీయూఎస్ మండల అధ్యక్షుడు గంగాధర్, కార్యదర్శి కృష్ణయ్య, రాష్ట్ర మహిళా కో కన్వీనర్ కె.విద్యావతి, జిల్లా కార్యదర్శి సి.భాగ్యమ్మ, కార్యవర్గ సభ్యులు శంకర్, మండల ఉపాధ్యక్షులు అనంతరెడ్డి, శివకుమార్, గౌరవ అధ్యక్షుడు రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

3.6 కిలోల గంజాయి స్వాధీనం

ఇద్దరు అరెస్ట్



గచ్చిబౌలి: ఓయో హోటల్ కేంద్రంగా గంజాయి విక్రయాలు చేస్తున్న ఇద్దరిని రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. గచ్చిబౌలి పీఎస్ పరిధిలోని కొండాపూర్‌లోని ఓయో హోటల్‌లో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో శుక్రవారం రాత్రి ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. నెల్లూరు జిల్లా కావలికి చెందిన రాజు(25), మధ్యప్రదేశ్‌కు చెందిన సంజన్(18)లను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి అమ్మకానికి సిద్ధంగా ఉంచిన 3.62 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి

గోల్కొండ: సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి లభిస్తుందని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు వైస్ ప్రెసిడెంట్ మౌలానా ఉబేదుల్లా ఆజ్మీ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకీలోని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా టీఎఫ్‌సీఓ చైర్మన్ మహ్మద్ నజీబ్ ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద, బడుగు వర్గాలకు సేవ చేయడం ఒక గొప్ప కార్యం అని అన్నారు. కార్యక్రమంలో ఏసీపీలు సయ్యద్ ఫయాజ్, నయీముద్దీన్ జావేద్ తదితరులున్నారు.

ఆలయాల భద్రత అందరి బాధ్యత


అనంత్‌కృష్ణను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జియాగూడ: ఆలయాల భద్రత అందరి బాధ్యతగా భావించాలని బీజేవైఎం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పడాల అనంత్‌కృష్ణ అన్నారు. ఈ మేరకు శనివారం కార్వాన్ బాంజవాడిలోని బంగారు మైసమ్మ ఆలయంలో ఆలయ భద్రత కోసం సుమారు రూ.30 వేలతో సొంతంగా నాలుగు ఇంటర్నెట్ ప్రొటోకాల్ కెమెరాలను ఏర్పాటు చేయించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు సత్యనారాయణ, కె.భిక్షపతి, జింక కృష్ణ, మాడిశెట్టి శ్రీనివాస్, ఎ.కృష్ణ, యాదగిరి, ముల్లె నిఖిలేష్, క్రాంతి, సురేష్, శివ, వినాయకరావు పాల్గొన్నారు.



హైదర్‌గూడలో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు నీరు


హైదర్‌గూడలో గుంతలమయంగా మారిన రోడ్డు

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం!

- అధ్వానంగా డ్రైనేజీ వ్యవస్థ
- రోడ్లపై పొంగి ప్రవహిస్తున్నమురుగు
- ఎక్కడికక్కడ పేరుకుపోతున్న వ్యర్థాలు

అత్తాపూర్: అత్తాపూర్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. పాతకాలపు డ్రైనేజీ వ్యవస్థ పెరుగుతున్న జనాభా అవసరాలను ఏమాత్రం తీర్చలేకపోతోంది. ఇబ్బడిముబ్బడిగా కాలనీలు, అపార్ట్‌మెంట్లు పెరిగిపోవడం.. వాటిల్లోని ప్రజల వినియోగానికి సరిపడా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించకపోవడంతో మురుగు కాస్తా డ్రైనేజీల నుంచి పొంగి రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో అత్తాపూర్ ప్రాంతంలో అన్ని రోడ్లనూ మురుగు మింగేసి గుంతలను మాత్రమే మిగిల్చింది.

◆ అత్తాపూర్‌లోని జనప్రియ యుటోపియా ప్రాంతంలో వందలాదిగా అపార్ట్‌మెంట్లు వెలిశాయి. వెయ్యి గృహాలు ఉన్న ప్రాంతంలో లెక్కకుమించి అపార్ట్‌మెంట్లు నిర్మితమయ్యాయి. దీంతో ఆయా అపార్ట్‌మెంట్ల ప్రజల రాకపోకలు సాగించేందుకు సరిపడా రోడ్లు నిర్మించలేదు. ఉన్న రోడ్లను కూడా డ్రైనేజీల నుంచి పొంగి ప్రవహించే మురుగు గుంతలమయం చేసింది.

◆ రోడ్ల విషయం ఇలా ఉంటే కాలనీలు, బస్తీల్లో నిత్యం ఉత్పన్నం అయ్యే చెత్త ఇతర వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించే విషయంలో నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. ఈ కారణంగా రోడ్లకు ఇరువైపులా చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. చెత్త కుప్పల నుంచి ముక్కుపుటాలు అదిరేలా దుర్గంధం వెదజల్లుతోంది. పరిసర ప్రాంతాల ప్రజలతోపాటు వాహనదారులు, పాదచారులు దుర్గంధాన్ని భరించలేక ముక్కులు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.


అత్తాపూర్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారం

◆ ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి అత్తాపూర్‌లో పారిశుద్ధ్య వ్యవస్థను ఆధునీకరించి ప్రజలకు మెరుగైన వాతావరణాన్ని అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మెరుగైన వసతుల కల్పనే లక్ష్యం

- ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి
- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా మెరుగైన వసతులను కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 4, 5, 6, 7వ వార్డులలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఆయన శనివారం ప్రారంభించారు. రూ. 3.80 కోట్ల వ్యయంతో కోకాపేటలో నిర్మించిన యాదవ కమ్యూనిటీ హాల్, రూ. 2.20 కోట్లతో నిర్మించిన రాజీవ్ గృహ కల్ప కమ్యూనిటీ హాల్, రూ. 40 లక్షలతో నిర్మించిన సామూహిక మూత్రశాలలు, రూ. 70 లక్షలతో నార్సింగిలో నిర్మించిన ముదిరాజ్ కమ్యూనిటీ హాల్, రూ. 1.15 కోట్లతో నార్సింగిలో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్లను మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... మున్సిపాలిటీలలో ప్రజలు ఎలాంటి శుభకార్యక్రమాలు జరుపుకోవాలన్నా ఫంక్షన్ హాల్‌లను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. వాటికి లక్షలాది రూపాయలు ఖర్చు అవుతున్నాయని, అలాంటి కార్యక్రమాలను ఇలాంటి కమ్యూనిటీ హాల్‌లలో నిర్వహించుకుంటే డబ్బు ఆదా అవుతుందన్నారు. వాటిని ఆయా కుల సంఘాల వారు సద్వినియోగం చేసుకోవాలని, రాబోయే రోజుల్లో వాటిల్లోకి వంట సామగ్రి, కుర్చీలు లాంటివి సమకూర్చుకోవాలని సూచించారు. నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్, నార్సింగి మార్కెట్ కమిటీ చైర్మన్ కె.వేణుగౌడ్, నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ విజయ్‌బాబు, టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్‌లు ఎ.దుర్గేష్‌యాదవ్, జి.శివారెడ్డి, జి.అమరేందర్‌రెడ్డి, పత్తి శ్రీకాంత్, జి.వెంకటేశ్‌యాదవ్, కె.లక్ష్మీప్రవళిక కిరణ్, పత్తి ప్రవీణ్‌కుమార్, జి.అరుణజ్యోతి, డీఈ నరేష్‌కుమార్, మేనేజర్ యోగేష్, ఏఈ శ్రీనివాస్, నాయకులు పి.చంద్రశేఖర్‌రెడ్డి, పాపిరెడ్డి, ప్రవీణ్ యాదవ్, హరిశంకర్, పాల్గొన్నారు.


కోకాపేటలో యాదవ కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

పని చేసే వారికే కాంగ్రెస్‌లో పదవులు

గోల్కొండ: పని చేసే వారికే కాంగ్రెస్‌లో పదవులు దక్కుతాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, గుడిమల్కాపూర్ కూరగాయల మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముంగి రఘుపాల్‌రెడ్డిఅన్నారు. శనివారం ఆయన నేతాజీనగర్‌లోని తన కార్యాలయంలో పలువురు కాంగ్రెస్ నాయకులు మార్కెట్ కమిటీ నియామకంపై చేస్తున్న విమర్శలపై ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ మారుతూ కాంగ్రెస్‌లోకి చేరిన వారు పదవులు ఆశించడం ఎంత వరకు సబబుఅని ప్రశ్నించారు. మార్కెట్ కమిటీ పాలక మండలిలో ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుందన్నారు. మరోవైపు కార్వాన్, నాంపల్లి నియోజకవర్గాల నుంచి సైతం మొత్తం ముగ్గురిని కమిటీలో సభ్యులుగా నియమించడం జరిగిందన్నారు. ఈ మార్కెట్ కమిటీ పాలకమండలి కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాదన్న విషయం వారికి తెలియదా అని ప్రశ్నించారు. రాజేంద్రనగర్, చేవెళ్ల, షాద్‌నగర్, మక్తల్ తదితర ప్రాంతాల రైతులు, రైతు నాయకులతో పాలకమండలిని భర్తీ చేస్తారని ఆయన అన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ, వినోద్‌సింగ్, అబ్దుల్ అమీద్, గజ్రే కిషన్, షకీలా, వనజ తదితరులున్నారు.

రైతులకు అండగా ఉంటాం

జియాగూడ: గుడిమల్కాపూర్ మార్కెట్ యార్డ్‌కు వచ్చే రైతులకు ఎల్లవేళలా అండగా ఉంటామని మార్కెట్ నూతన డైరెక్టర్ రఘుపాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం కాంగ్రెస్ పార్టీ జియాగూడ డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీకిషన్ గజరే ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నూతన డైరెక్టర్ కలిసి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్రీకిషన్ గజరే మాట్లాడుతూ..కార్వాన్ నుంచి రఘుపాల్‌రెడ్డికి ఇవ్వడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏ బ్లాక్ అధ్యక్షుడు కురకుల కృష్ణ, యూత్ నాయకుడు గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు నార్సింగిలో మల్లన్న కల్యాణం

మణికొండ: నార్సింగిలో వెలసిన మల్లికార్జున స్వామి సహిత కేతకి భ్రమరాంబా అమ్మవార్ల కల్యాణ మహోత్సవం ఆదివారం ఉదయం 11.05 గంటలకు నిర్వహించనున్నట్లు దేవాలయ నిర్వహణ కర్త, కాంగ్రెస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.అశోక్‌యాదవ్ తెలిపారు. ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఉదయం 8 గంటలకు గోపూజ, పుణ్యాహవచనం, గణపతి పూజ, 9 గంటలకు గణపతి హవనం, 11.05 గంటలకు కల్యాణ మహోత్సవం, సాయంత్రం 7 గంటలకు అగ్నిగుండాలు తొక్కటం, రాత్రి 8 గంటలకు సొడమ్మ బోనాలు, రాత్రి 9 గంటలకు మల్లన్న ఒగ్గుకథ ఉంటుందన్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు నాగవల్లి, మంగళవారం ఉదయం 11.30 గంటలకు ఎల్లమ్మ కల్యాణం, బోనాల ఉత్సవాలు ఉంటాయన్నారు. గండిపేట మండల పరిధిలోని మల్లన్న భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు కేన్సర్‌పై అవగాహన శిబిరం

మైలార్‌దేవ్‌పల్లి: కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం కేన్సర్‌పై అవగాహన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సర్జికల్ ఆంకాలజీ విభాగం డాక్టర్ మధు దేవరశెట్టి తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పద్మశాలీ పురంలోని మార్కండేయ భవన్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శిబిరం అందుబాటులో ఉంటుందన్నారు. శిబిరాన్ని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ప్రారంభిస్తారని తెలిపారు. ప్యాంక్రియాటిక్ కేన్సర్, లంగ్ కేన్సర్, లివర్ కేన్సర్, కొలరెక్టల్ కేన్సర్, థైరాయిడ్ కేన్సర్ తదితర వాటిపై నిపుణులు అవగాహన కలిగిస్తారని వివరించారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేషన్‌కార్డుల దరఖాస్తుల పరిశీలన

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో కొనసాగుతున్న రేషన్‌కార్డుల దరఖాస్తుల పరిశీలనను శనివారం రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాజేంద్రనగర్‌లో జరుగుతున్న కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ... రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్, సులేమాన్‌నగర్, శాస్త్రీపురం డివిజన్లకు చెందిన మొత్తం 7 వేల దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం 25 మంది సిబ్బందిని నియమించామన్నారు. సిబ్బంది దరఖాస్తుదారుని చిరునామాకు వెళ్లి పూర్తి వివరాలను సేకరిస్తున్నారన్నారు. సిబ్బందికి ఇప్పటికే పూర్తి శిక్షణ అందించామన్నారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులున్నా వెంటనే సరి చేస్తున్నట్లు తెలిపారు. శనివారం సాయంత్రానికి 4500 దరఖాస్తులను పరిశీలించినట్లు తెలిపారు. మరో 2,500 దరఖాస్తులను రెండు రోజుల్లో సిబ్బంది పరిశీలించి నివేదికను అందజేస్తారన్నారు.

21 నుంచి గ్రామ సభలు

శంషాబాద్ రూరల్: ప్రభుత్వం అమలు చేయనున్న పలు సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం మండలంలోని వివిధ గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మున్నీ తెలిపారు. ఈ నెల 21 నుంచి 24 వరకు ఉదయం 10 గంటల నుంచి సభలు ప్రారంభిస్తామన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం అర్హుల ఎంపిక చేపడతామన్నారు. పంచాయతీల స్పెషల్ ఆఫీసర్, నోడల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో సభలు ఏర్పాటు చేస్తామన్నారు. 21న చౌదరిగూడ, కాచారం, రాయన్నగూడ, ముచ్చింతల్, పెద్దతూప్ర, 22న జూకల్, మదన్‌పల్లి, మదన్‌పల్లిపాతతండా, ననాజీపూర్, రామంజాపూర్, కవేలిగూడ, సుల్తాన్‌పల్లి, దొడ్డి, 23న మదన్‌పల్లికొత్తతండా, జూకల్, పాల్మాకుల, శంకరాపురం, చెర్లగూడ, 24న పెద్దషాపూర్, కవ్వగూడ, మల్కారం, నర్కూడ, అమ్మపల్లి, జూకల్, పాల్మాకుల రెవెన్యూ గ్రామాల సభలను ఆయా పంచాయతీల కార్యాలయాల వద్ద ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీవో వివరించారు.

అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలి: ఎమ్మెల్యే జాఫర్


బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే జాఫర్

యాకుత్‌పురా: అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ అధికారులకు సూచించారు. శనివారం మొఘల్‌పురా డివిజన్‌లోని జహంగీర్‌నగర్ పరిసర ప్రాంతాల్లో ఆయన కార్పొరేటర్ నస్రీన్ సుల్తానా, పలువురు అధికారులతో కలిసి స్థానికంగా జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పలు ప్రాంతాల్లో డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్, సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామన్నారు.

నకిలీ సర్ఫ్ కంపెనీపై ఎస్ఓటీ పోలీసుల దాడి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రముఖ బ్రాండ్‌లకు చెందిన నకిలీ సర్ఫ్‌ను తయారు చేస్తున్న కంపెనీపై రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు దాడి చేశారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాటేదాన్ పారిశ్రామికవాడలో నకిలీ సర్ఫ్ కంపెనీ నిర్వహిస్తున్నట్లు ఎస్ఓటీ పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు శనివారం రాత్రి సదరు కంపెనీపై దాడి చేశారు. ప్రముఖ బ్రాండ్లకు చెందిన నకిలీ సర్ఫ్ ప్యాకెట్‌లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాలకు చెక్

శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం


మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం

శంషాబాద్: ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని.. అప్పుడే రోడ్డు ప్రమాదాలను విజయవంతంగా అరికట్టే అవకాశం ఉందని శంషాబాద్ ట్రాఫిక్ ఏసీపీ నాగభూషణం పేర్కొన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలో క్యాబ్ డ్రైవర్లతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఏసీపీ మాట్లాడుతూ... ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘనల కారణంగా జరిగే అనర్థాలతోపాటు కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. ప్రమాదాల నివారించాలంటే ట్రాఫిక్ సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు కారణంగా వివిధ దేశాలు, ఆయా నగరాల నుంచి వచ్చే పర్యాటకులు, ప్రయాణికులను అతిథులుగా గుర్తించి మర్యాదగా ప్రవర్తించాల్సిన బాధ్యత డ్రైవర్లపై ఉందన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

చార్మినార్: ప్రభుత్వ సిటీ కాలేజీ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 21, 22 తేదీలలో జాతీయ సదస్సు నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ డాక్టర్ బాలభాస్కర్ తెలిపారు. 'ఆవిష్కరణ, మౌలిక సదుపాయాలు, పారిశ్రామికీకరణ ద్వారా స్థిర ఆర్థికాభివృద్ధి'అనే అంశంపై జాతీయ సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి సహకారం అందిస్తుందన్నారు. శనివారం ఆయన సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను అనుసరించి, మౌలిక సదుపాయాలు, పారిశ్రామికీకరణకు సంబంధించిన ముఖ్యమైన అంశాలను చర్చించడానికి పరిశోధకులు, విద్యావేత్తలు, పరిశ్రమ నిపుణులకు ఒక వేదికగా ఈ సదస్సు నిలుస్తుందన్నారు.

అట్టహాసంగా క్రీడా సంబురం

- ఉద్యాన విశ్వవిద్యాలయ క్రీడోత్సవాన్ని ప్రారంభించిన వీసీ రాజారెడ్డి


సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థులు


పోటీలను ప్రారంభిస్తున్న వీసీ ఇతర అధికారులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో ఇంటర్ కాలేజ్, స్పోర్ట్స్, గేమ్స్, కల్చరల్ పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ క్రీడా పోటీలలో రాజేంద్రనగర్, మొజర్ల, మల్యాల్, ములుగు, ఫారెస్ట్ ఉద్యాన విశ్వవిద్యాలయం నుంచి 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బాల్‌బ్యాడ్మింటన్‌తో పాటు ఇండోర్ గేమ్స్, చిత్రలేఖనం తదితర పోటీలు నిర్వహిస్తున్నారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ రాజారెడ్డి క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక ఉల్లాసానికి, శారీరకంగా దృఢత్వానికి ఎంతో అవసరమన్నారు. విద్యార్థుల నూతన ఆలోచనలకు పదును పెడుతూ కొత్త కొత్త ఆవిష్కరణలను తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఐదు కళాశాలల డీన్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.